ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

## ఛత్తీస్‌ఘఢ్‌లో ఎన్‌కౌంటర్
### 9 మంది మావోల హతం



2లో..

సంపుటి: 2 | సంచిక: 146 | పేజీలు: 4 | వెల: రూ.3/- | బుధవారం 4 సెప్టెంబర్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్

## తక్షణ సాయంగా
# 2 వేల కోట్లు ఇవ్వండి

### వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించండి

**కేంద్రాన్ని మరోమారు కోరిన సిఎం రేవంత్**
**మహబూబాబాద్ వరద ప్రాంతాల్లో పర్యటన**
**వరదనష్టంపై అధికారులతో సమీక్ష**
**జిల్లాల్లోనూ ఆక్రమణల తొలగింపునకు హైడ్రా**



మహబూబాబాద్, సెప్టెంబర్ 3 (ప్రభాత ఉదయం): కేంద్రం వరదలను జాతీయ విపత్తుగా గుర్తించి 2వేల కోట్లను తక్షణ సాయంగా అందించాలని సిఎం రేవంత్ రెడ్డి కోరారు. వరదనష్టం భారీగా ఉ ందని, 5300 కోట్ల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేశారని అన్నారు. దీనిపై ఇప్పటికే కేంద్రానికి లేఖ రాశానని, జాతీయ విపత్తుగా గుర్తించాలని కోరానని అన్నారు. మహబూబాబాద్ జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదైందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. జిల్లాలో పర్యటించిన ఆయన.. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్కతో కలిసి వరదలపై సమీక్ష నిర్వహించారు. మంగళవారం నాడు మహబూబాబాద్ జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలన చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... అనంతరం మహబూబాబాద్ జిల్లాలో వాటిల్లిన నష్టాలపై కలెక్టరేట్ లో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో నలుగురు మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. దాదాపు 30వేల ఎకరాల్లో ..మిగతా 2లో

### వరద సహాయక చర్యల్లో పోలీసుల పనితీరు భేష్

**ప్రాణాలకు తెగించి పలువురిని కాపాడిన పోలీసులు**
**సీతారాం తండాలో చిక్కుకున్న 40మంది తరలింపు**
**సిరోల్ ఎస్ఐ నగేశ్‌ను సన్మానించిన సిఎం రేవంత్**

2



### ప్రభుత్వ వైఫల్యం వల్లే
## వరదల్లో భారీ నష్టం

**ప్రజలను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం**
**పాలనపై పట్టులేక విపక్షాలపై సిఎం విమర్శలు**
**మృతుల కుటుంబాలకు 25లక్షల పరిహారం ఇవ్వాలి**
**ఖమ్మంలో పర్యటించిన ఎమ్మెల్యే హరీష్ రావు**

ఖమ్మం, సెప్టెంబర్ 3 (ప్రభాత ఉదయం): ఖమ్మం నగరంలో పర్యటించిన మాజీ మంత్రి హరీష్ రావు.. రాష్ట్ర ప్రభుత్వం తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వ వైఫల్యం వల్లే వరదల కారణంగా భారీ నష్టం సంభవించిందన్నారు. ఖమ్మం బీఆర్ ఎస్ పార్టీ ఆఫీసులో మీడియాతో మాట్లాడిన ఆయన.. మూడు నాలుగు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా జనజీవనం స్తంభించిపోయిందన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం, వైఫల్యం ..మిగతా 2లో

## వరద నష్టాలను అంచనా వేయండి

**అధికారులను ఆదేశించిన సిఎస్ శాంతికుమారి**



హైదరాబాద్, సెప్టెంబర్ 3 (ప్రభాత ఉదయం): రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల వలన జరిగిన ఆస్తి, ప్రాణ నష్టం వివరాలను ఈ వారాంతంలోగా సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. వర్షాలు, వరదల వలన జరిగిన నష్టం అంచనా వేయడం పై నేడు సచివాలయంలో వివిధ శాఖల కార్యదర్శులు, హెచ్ ఓ డీ లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. డీజీపీ డా.జితేందర్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రామకృష్ణ రావు, రవీ గుప్తా, వికాస్ రాజ్, అర్విండ్ కుమార్, ముఖ్య కార్యదర్శులు దాన కిషోర్, నవీన్ మిట్టల్, కార్యదర్శులు రాహుల్ బొజ్జా, రఘునందన్ రావు, లోకేష్ కుమార్, రోనాల్డ్ రోస్, ప్రశాంత్ జీవన్ పాటిల్ తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు. సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, ఇప్పటికీ ..మిగతా 2లో

## ఖమ్మంలో బిఆర్ఎస్ నాయకుల పర్యటన

**మాజీమంత్రి పువ్వాడ వాహనంపై రాళ్లదాడి**
**ఒకిరికి గాయాలు..ఘటనపై మండిపడ్డ కెటిఆర్**



ఖమ్మం, సెప్టెంబర్ 3 (ప్రభాత ఉదయం): తెలంగాణలో నాలుగు రోజులుగా భారీ వర్షాలు పడుతున్నాయి. ఏకధాటిగా కురుస్తున్న వానలతో ఖమ్మం జిల్లాలోని మున్నేరు వాగు ఉధృతంగా ప్రవహించింది. దీంతో పలు కాలనీలు జలమయం అయ్యాయి. కాలనీల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. బాధితులను ప్రభుత్వం అండగా నిలిచి సహాయ కార్యక్రమాలు చేపట్టింది. మంగళవారం బీఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రులు ఖమ్మం..మిగతా 2లో

## తెలంగాణ విద్యాకమిషన్ ఏర్పాటు

**ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం**



హైదరాబాద్, సెప్టెంబర్ 3 (ప్రభాత ఉదయం): తెలంగాణ విద్యా కమిషన్ ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రి ప్రైమరీ నుంచి ఉన్నత విద్య వరకు సమగ్ర పాలసీ తయారీకి ఈ కమిషన్ పని చేయనుంది. చైర్మన్, ముగ్గురు సభ్యులతో విద్యా కమిషన్ ఏర్పాటు కానుంది. విద్యా కమిషన్ చైర్మన్, సభ్యులను ప్రభుత్వం త్వరలోనే నియమించనుంది. చైర్మన్, సభ్యులు ..మిగతా 2లో




### హత్యాచారాలకు
## ఇక మరణశిక్ష

**అపరాజిత విమెన్ అండ్ చైల్డ్ బిల్లుకు బెంగాల్ ఆమోదం**
**ఇదో చారిత్రక బిల్లు అని అభివర్ణించిన సిఎం మమత**

కోల్‌కతా, సెప్టెంబర్ 3 (ప్రభాత ఉదయం): పశ్చిమ బెంగాల్ లో జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటన ప్రకంపనలు సృష్టిస్తోంది. తీవ్ర విమర్శల నేపథ్యంలో.. అసెంబ్లీలో మంగళవారం బెంగాల్ ప్రభుత్వం హత్యాచార నిరోధక బిల్లును ప్రవేశపెట్టింది. 'అపరాజిత విమెన్ అండ్ చైల్డ్ బిల్లు' పేరిట దానిని తీసుకువచ్చింది. ఇందుకోసం ప్రత్యేక సెషన్‌ను నిర్వహిస్తోంది. చర్చ అనంతరం దీనికి ఏకగ్రీవంగా ఆమోదం లభించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అసెంబ్లీలో మాట్లాడారు. ఈ బిల్లు చరిత్రాత్మకమని ..మిగతా 2లో

### ఓఆర్ఆర్ పరిధిలోని
## 51 గ్రామాల విలీనం

**సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేస్తూ ఉత్తర్వులు**



హైదరాబాద్, సెప్టెంబర్ 3 (ప్రభాత ఉదయం): ఓఆర్ఆర్ పరిధిలోని 51 గ్రామా లను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసింది. రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లోని పలు గ్రామాలు విలీన జాబితాలో ఉన్నాయి. పెద్ద అంబర్‌పేట మున్సిపా లిటీలో.. బాచారం, గౌరెల్లి, కుత్బుల్లాపూర్ తారామతిపేట పంచాయతీలు విలీనం చేస్తూ ఆదేశాలు ఇచ్చింది. శంషాబాద్ మున్సిపాలిటీలో.. బహదూర్ గూడ, ..మిగతా 2లో



## ఎస్డీఆర్ఎఫ్ నిధులతో బాధితులను ఆదుకోవాలి

**రాష్టానికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సూచన**

హైదరాబాద్, సెప్టెంబర్ 3 (ప్రభాత ఉదయం): రాష్ట్రప్రభుత్వం వద్ద ఉన్న ఎస్డీఆర్ఎఫ్ నిధులతో బాధితులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కోరారు. యుటిలైజేషన్ నిధులపై బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఇప్పటివరకు ఎలాంటి రిపోర్ట్ విడుదల చేయలేదని చెప్పారు. ఎస్డీఆర్ఎఫ్ కింద రాష్ట్ర ప్రభుత్వం వద్ద రూ. 1300 కోట్లకు పైగా నిధులు ఉన్నాయని తెలిపారు. మరో రూ. 200 కోట్లు యూసీ నిధులున్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయి నివేదిక సమర్పిస్తే కేంద్ర ప్రభుత్వం దానికి తగిన నిధులు విడుదల చేసేందుకు సిద్ధంగా ఉందని కిషన్‌రెడ్డి తేల్చిచెప్పారు. వరదల్లో చనిపోయిన వారికి కేంద్ర ప్రభుత్వం నుంచి రూ. 3లక్షలు వస్తాయని కిషన్ రెడ్డి హామీ ..మిగతా 2లో

# ఛత్తీస్‌ఘడ్‌లో ఎన్‌కౌంటర్

రాయపూర్, సెప్టెంబర్ 3 (ప్రభాత ఉదయం): ఛత్తీస్‌గఢ్ బస్తర్ ప్రాంతం మరోసారి కాల్పులతో దద్దరిల్లింది. దంతెవాడ-బీజాపూర్ జిల్లాల సరిహద్దుల్లోని దండకారణ్యంలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా బలగాలతో జరిగిన కాల్పుల్లో 9 మంది మావోయిస్టులు మృతిచెందినట్లు పోలీసులు వెల్లడించారు. నిఘా వర్గాల సమాచారం మేరకు ఈ ప్రాంతంలో డిస్టిక్ట్ రిజర్వ్ గార్డ్, సీఆర్పీఎఫ్ బలగాలు సంయుక్త ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో భద్రతాబలగాలను చూసిన మావోయిస్టులు వారిపై కాల్పులు జరిపారు. దీంతో భద్రతా బలగాలు ఎదురుకాల్పులు చేపట్టాయి. ఉదయం 10.30 గంటలకు మొదలైన ఎన్‌కౌంటర్ ఇంకా కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు. ఇప్పటివరకు 9 మంది మావోయిస్టుల మృతదేహాలు లభ్యమైనట్లు తెలిపారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఘటనాస్థలంలో పెద్ద ఎత్తున ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఆగస్టు 29న నారాయణపుర్ జిల్లా అబూజ్‌మాడ్ అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు-మావోయిస్టు దళాల మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఇందులో ముగ్గురు మహిళా మావోయిస్టులు మృతి చెందారు. తాజా ఘటనతో కలిపి ఛత్తీస్‌గఢ్‌లో ఈ ఏడాది ఇప్పటివరకు జరిగిన ఎదురుకాల్పుల ఘటనల్లో 154 మంది మావోయిస్టులు మరణించారని పోలీసులు వెల్లడించారు.

## హత్యాచారాలకు
# ఇక మరణశిక్ష

మొదటి పేజీ తరువాయి...

వ్యాఖ్యానించారు. సీబీఐ నుంచి న్యాయం కోరుతున్నాం. దోషులకు మరణశిక్ష విధించాలని కోరుతున్నాం. ఈ రోజు మేం ప్రవేశపెట్టిన బిల్లుపై గవర్నర్ సంతకం చేయాలని విపక్షాలు అడగాలి. ఆ తర్వాత దానిని అమలు చేసే బాధ్యత మాది. ఈ బిల్లు ద్వారా కేంద్రచట్టంలోని లోపాలను సరిద్దిద్దే ప్రయత్నం చేస్తున్నాం. సత్వర విచారణ, బాధితులకు న్యాయం లభించడం ఈ బిల్లు లక్ష్యం. ఒకసారి ఈ బిల్లు పాస్ అయితే.. ప్రత్యేక అపరాజిత టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటుచేస్తాం. అత్యాచారం వంటి దారుణాలు మానవాళికి శాపాలు. ఇలాంటి ఘోరాలు జరగకుండా సామాజిక సంస్కరణలు రావాలి. యూపీ, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో మహిళలపై అసాధారణ స్థాయిలో నేరాలు జరుగుతున్నాయి. ఉన్నావ్, హాథ్రస్ కేసుల్లో న్యాయం గురించి ఎవరూ మాట్లాడటం లేదు. కానీ బెంగాల్‌లో మహిళలకు కోర్టుల్లో న్యాయం లభిస్తుంది. మీవలే నేనూ ప్రధాని, హోంమంత్రిపై నినాదాలు చేస్తే ఎలా ఉంటుంది..? మహిళ రక్షణ కోసం సమర్థవంతమైన చట్టాలు తీసుకురాలేని ముఖ్యమంత్రులు రాజీనామా చేయాలని డిమాండ్ చేయండని పేర్కొన్నారు. మృతురాలికి నివాళి అర్పించారు. హత్యాచార ఘటనపై మమత ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తోన్న విపక్షాలు.. ఈ బిల్లుకు మద్దతు ఇచ్చాయి. ఈ బిల్లును హడావుడిగా తీసుకురావడాన్ని ప్రశ్నించిన భాజపా.. కొన్ని సవరణలు సూచించింది. అయితే వాటికి ఆమోదం లభించలేదు. దానిపై భాజపా నిరసన వ్యక్తం చేయడంతో సభలో గందరగోళ వాతావరణం ఏర్పడింది. అలాగే మమత తన ప్రసంగంలో మోదీ, అమిత్ షా పేర్లను ప్రస్తావించడంపైనా అభ్యంతరం వ్యక్తమైంది. ఇదిలా ఉంటే.. కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ వైద్య కళాశాల ఆసుపత్రిలో జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటన దర్యాప్తులో సీబీఐ వేగం పెంచింది. ఈ కేసులో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆసుపత్రి మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్‌ను అరెస్టు చేసింది. ఆసుపత్రి ఆర్థిక వ్యవహారాల్లో అవకతవకలకు సంబంధించి ఆయన్ను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించింది. ఈ కేసులో ఇంతకు ముందు పోలీస్ పౌర వాలంటీర్ సంజయ్ రాయ్‌ని అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.

# ఎస్డీఆర్‌ఎఫ్ నిధులతో బాధితులను ఆదుకోవాలి

మొదటి పేజీ తరువాయి...

ఇచ్చారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన రూ. 5లక్షల్లో కేంద్రం ఇచ్చే రూ. 3లక్షలు కలుపుకొని ఇస్తారా? లేదా? రాష్ట్ర ప్రభుత్వమే రూ. 5లక్షలు ఇస్తోందా? అనే విషయంపై క్లారిటీ లేదని కిషన్ రెడ్డి అన్నారు. మంగళవారం బీజేపీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ... ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి.. వారం రోజుల కంటే ఎక్కువ రోజులు ఉంటే రూ. 16వేలు, వారం లోపుల ఆస్పత్రిలో ఉంటే రూ. 4 వేలను ఆస్పత్రి ఖర్చులకు కేంద్రం ఇస్తుందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. అంటు వ్యాధులు సోకకుండా మెడిసిన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 17ఉత్సవాలపై రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేసిందని విమర్శలు చేశారు. దీంతో కేంద్ర ప్రభుత్వమే నిర్వహించాల్సిన దుస్థితి నెలకొందని అన్నారు. 1948లో నిజాం లొంగిపోయిన రోజు... గణెలెష్ నిమజ్జనం ఒకేరోజు జరిగిందని చెప్పారు. మళ్లీ 75ఏళ్ల తర్వాత ఇది రిపేట్ అవ్వడం సంతోషమని కిషన్‌రెడ్డి వెల్లడించారు.

# తెలంగాణ విద్యాకమిషన్ ఏర్పాటు

మొదటి పేజీ తరువాయి...

రెండేండ్ల పాటు ఈ పదవుల్లో కొనసాగనున్నారు. విద్యా కమిషన్ ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రి ప్రైమరీ నుంచి ఉన్నత విద్య వరకు సమగ్ర పాలసీ తయారీకి కమిషన్ ఏర్పాటు చేసినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఛైర్మన్, ముగ్గురు సభ్యులతో విద్యా కమిషన్ ఏర్పాటు చేయనున్నారు. కమిషన్ ఛైర్మన్, సభ్యులను త్వరలో నియమించనున్నట్టు ప్రభుత్వం తెలిపింది. విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకురాబోతున్నట్టు ఇటీవల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల స్పష్టం చేశారు. ఇందులో భాగంగా విద్యాకమిషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

# ఓఆర్‌ఆర్ పరిధిలోని 51 గ్రామాల విలీనం

మొదటి పేజీ తరువాయి...

పెద్దగోల్కొండ, చిన్నగోల్కొండ, హమీదుల్లానగర్, రషీద్ గూడ, ఘంసీమిగూడ విలీనం అవుతాయి. నార్సింగి మున్సిపాలిటీలో.. మిర్జాగూడ గ్రామపంచాయతీ , తుక్కుగూడ మున్సిపాలిటీలో.. హర్షగూడ గ్రామపంచాయతీ, మేడ్చల్ మున్సిపాలిటీలో.. పూడూరు, రాయిలాపూర్ గ్రామపంచాయతీలు, దమ్మాయిగూడ మున్సిపాలిటీలో.. కీసర, యాద్గిరిపల్లి, అంకిరెడ్డిపల్లి, చీర్యాల, నర్సపల్లి, తిమ్మాయిపల్లి, గారం మున్సిపాలిటీలో.. బోగారం, గోదాముకుంట, కరీంగూడ, రాంపల్లి దాయార గ్రామాలు, పోచారం మున్సిపాలిటీలో.. వెంకటాపూర్, ప్రతాపసింగారం, కొర్రెముల, కాచివానిసింగారం, చౌదరిగూడ విలీనం అవుతాయి. ఘట్‌కేసర్ మున్సిపాల్టీలో.. అంకుషాపూర్, ఔషాపూర్, మాదారం, ఏదులాబాద్, ఘనాపూర్, మర్పల్లిగూడ విలీనం అవుతాయి. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో.. మునీరాబాద్, గౌడవెల్లి పంచాయతీలు, తూంకుంట మున్సిపాలిటీలో.. బొంరాసిపేట, శామీర్ పేట, బాబాగూడ పంచాయతీలు విలీనం కానున్నాయి.

## తక్షణ సాయంగా
# 2 వేల కోట్లు ఇవ్వండి

మొదటి పేజీ తరువాయి...




పంటనష్టం వాటిల్లిందని వెల్లడించారు. సహాయచర్యల్లో నిరంతరం పనిచేసిన రెవెన్యూ, పోలీసు సిబ్బందిని అభినందించారు. అధికారుల చర్యలతో ప్రాణనష్టం తగ్గించగలిగాం. మృతుల కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున పరిహారం ప్రకటించాం. పంట నష్టం అంచనా వేసి పరిహారం అందజేస్తాం. నష్టపోయిన మూడు తండాలవాసులకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం. నష్టంపై కేంద్రానికి నివేదించడానికి నివేదిక తయారు చేయాలి. కేంద్రం దీన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలి. ఆస్తి, ప్రాణ నష్ట పరిశీలనకు ప్రధాని మోదీని ఆహ్వానించాం. తక్షణమే రాష్ట్రానికి రూ.2వేల కోట్లు కేటాయించాలని కోరారు. వర్షం తగ్గినందున బురద తొలగించే పనులు అధికారులు ప్రారంభించాలి. ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తే ఇళ్లలోని బురద తొలగించవచ్చు. విష జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉంది.. మరింత జాగ్రత్తగా ఉండాలి. ఎంత ఒత్తిడి ఉన్నా హైడ్రా ఏర్పాటు చేసి ఆక్రమణలను కూల్చేస్తున్నాం అన్నారు. ప్రకృతి ప్రకోపిస్తే ఏం జరుగుతుందో మనం ఇతర రాష్ట్రాల్లో చూస్తున్నాం. చెరువులు, నాలాల ఆక్రమణల తొలగింపునకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుంది. ఆక్రమణలకు సహకరించిన వారిపై కూడా చర్యలు ఉంటాయి. పేదల ప్రాణాలు పోయాక ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తూ కూర్చోదు. పువ్వాడ ఆక్రమణలు తొలగించాలని హరీశ్‌రావు డిమాండ్ చేయగలరా? ఆక్రమణల తొలగింపునకు హరీశ్‌రావు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తారా? చెరువులను ఆక్రమించిన వారు ఎంతటివారైనా తొలగించాల్సిందే. ఆక్రమణల తొలగింపునకు విధివిధానాలు రూపొందించాలని సీఎం రేవంత్ అధికారులకు దిశానిర్దేశర చేశారు. హైడ్రా తరహాలో ప్రతి జిల్లాలోనూ ఒక వ్యవస్థను కలెక్టర్లు ఏర్పాటు చేసుకోవాలని నిర్దేశించారు. చెరువులను ఆక్రమించుకోవడం క్షమించరాని నేరం అని.. చెరువుల ఆక్రమణలపైన రాష్ట్ర వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ చేపడతామని రేవంత్ రెడ్డి చెప్పారు. ఆక్రమణలకు పాల్పడినది ఎంతటి వారైనా వదిలి పెట్టబోమని రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. చెరువుల ఆక్రమణకు సహకరించిన అధికారులపైన చర్యలు తీసుకోవాలని అన్నారు. చెరువులు, నాలాల ఆక్రమణల జాబితా సిద్ధం చేయాలి. మాజీ మంత్రి ఆక్రమణ వల్లనే ఖమ్మంలో వరదలు వచ్చాయనే ఫిర్యాదులు వచ్చాయి. అమెరికాలో జల్సాలో మునిగి తేలుతున్న ఆయన.. ప్రభుత్వం పైన విమర్శలు చేస్తున్నడు. వంద ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రలకు వెళ్లినట్లుగా హరీష్ రావు ఖమ్మం పర్యటనకు పోయిండు. ఖమ్మం మాజీ మంత్రి ఆక్రమణలపైన తొలగింపునకు హరీష్ రావు సహకరిస్తారా?అని ప్రశ్నించారు.680 మందికి పునరావాసం కల్పించాం. సీతారామ తండాలో వరద సమయంలో ప్రజలకు అండగా నిలబడ్డ ఎస్సై నగేష్ కి అభినందనలు. చనిపోయిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం చెల్లిస్తాం. ఆకేరు వాగు వరద బారిన పడుతున్న 3 తండాలను ఒకే ప్రాంతానికి తరలించి అదర్శ కాలనీ నిర్మించాలని కలెక్టర్ కు ఆదేశించాం. పంట నష్టం జరిగిన ప్రతి ఎకరానికి రూ.10 వేల సాయం అందిస్తాం. తెలంగాణలో వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని ప్రధానికి లేఖ రాశాం. జరిగిన నష్టాన్ని పరిశీలించడానికి రాష్ట్రానికి రావాలని ప్రధాన మంత్రిని కోరుతున్నాం. దోమల నివారణ చర్యలు తీసుకోవాలి. నష్టం జరిగిన ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం ఇతర ప్రాంతాల నుంచి అధికారులను రప్పించుకోవాలి. కూలిపోయిన విద్యుత్ లైన్లను తక్షణమే పునరుద్ధరించాలి. వరద ప్రమాద ప్రాంతాలు, ప్రమాదానికి కారణాలు, వాటిని ఎదుర్కొన్న తీరుపై బ్లూబుక్ ను తయారు చేసుకోవాలి. వాటిని కలెక్టరేట్లలో ఉంచాలని అన్నారు.రదలు వచ్చినప్పుడు కేసీఆర్ పదేళ్లలో ఎప్పుడైనా పరామర్శకు వచ్చారా..? మాసాయిపేటలో పసిపిల్లలు చనిపోతే కేసీఆర్ పరామర్శించలేదు. హైదరాబాద్ శివారులో పశు వైద్యురాలిని హత్యచేస్తే వెళ్లి చూడలేదు. మానవత్వం లేని మనిషి కేసీఆర్. ప్రతిపక్ష నేత ఎక్కడున్నాడు? ఎందుకు మాట్లాడటం లేదు? స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలు వరద బాధితులకు సాయం కోసం ముందుకు రావాలని రేవంత్ రెడ్డి పిలుపు ఇచ్చారు.

# వరద నష్టాలను అంచనా వేయండి

మొదటి పేజీ తరువాయి...

అనేక జిల్లాల్లో వరదలు, వానలు తగ్గుముఖం పట్టలేదని అన్నారు. జరిగిన నష్టాన్ని వెంటనే అంచనా వేయడానికి సంబంధిత శాఖల బృందాలను క్షేత్ర స్థాయికి పంపి, తగు జీపీఎస్ కోఆర్డినెట్‌లతో సహా సమర్పించాలని తెలిపారు. అదే విధంగా, రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రతీ జిల్లాలో స్టేట్ డిజాస్టర్ మేనేజ్మెంట్ ఫోర్స్ లను ఏర్పాటు చేయడానికి కావాల్సిన నిధులు, సిబ్బంది, పరికరాల వివరాలు వెంటనే సమర్పించాలని అన్నారు. ఈ వర్షాలు, వరదల వల్ల ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు కలుగకుండా వెంటనే తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో జీహెచ్ ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, సీఎండీ ముషారాఫ్ అలీ, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంత రావు, పాఠశాల విద్య శాఖ డైరెక్టర్ నర్సింహా రెడ్డిలు కూడా పాల్గొన్నారు.



## వరద సహాయక చర్యల్లో
# పోలీసుల పనితీరు భేష్

**ప్రాణాలకు తెగించి పలువురిని కాపాడిన పోలీసులు**
**సీతారాం తండాలో చిక్కుకున్న 40మంది తరలింపు**
**సిరోల్ ఎస్ఐ నగేశ్‌ను సన్మానించిన సిఎం రేవంత్**

మహబూబాబాద్, సెప్టెంబర్ 3 (ప్రభాత ఉదయం): మహబూబాబాద్, ఖమ్మం జిల్లాలో భారీ వర్షాలతో వరదలు పోటెత్తాయి. దీంతో అధికారులు, పోలీసులు పగలు రాత్రి అని తేడా లేకుండా సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. ప్రజలకు అవసరమైన సహాయం చేస్తూ.. వారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.. ఈ క్రమంలో మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతారాం తండాలో వరదల్లో చిక్కుకున్న 40 కుటుంబాలను పోలీసులు కాపాడారు.. వారిని సకాలంలో రక్షించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు.. అంతేకాకుండా.. చాలా మందికి ఆహారం సమకూర్చారు.. దీంతో మహబూబాబాద్ జిల్లాలోని పోలీస్ అధికారులను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి సన్మానించి ప్రశంసించారు. మహబూబాబాద్‌లో పర్యటించిన సీఎం రేవంత్ రెడ్డి.. అధికారులను అభినందించారు. సీతారాం తండాలో వరదల్లో చిక్కుకున్న వారిని ప్రజలను ఒడ్డుకు చేర్చడంలో కీలక భూమిక నిర్వహించిన మహబూబాబాద్ జిల్లాలోని సిరోల్ ఎస్.ఐ సిహెచ్ నగేష్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు.. ఈ సందర్భంగా శాలువా కప్పి సన్మానించారు. సహాయక చర్యల్లో ప్రధాన పాత్ర వహించిన పోలీసులను రేవంత్ రెడ్డి ప్రశంసించారు. అనంతరం, వరద నీటితో కేసముద్రం ఇంటికన్నె వద్ద రైల్వే ట్రాక్ కొట్టుకుపోవడంతో కేసముద్రం, మహబూబాబాద్ టౌన్ రైల్వేస్టేషన్ లో రైలు నిలిచిపోయి ప్యాసెంజర్లు ఇబ్బంది పడకుండా తినడానికి ఆహారంతో పాటు వాటర్ బాటిల్స్, బిస్కెట్ పాకెట్స్ సమకూర్చిన సీఐలను ముఖ్యమంత్రి సన్మానించారు. రైల్వే స్టేషన్ లో ఉన్న 5300 మంది ప్రయాణికులను కాజిపేటకు తరలించిన రూరల్ సీఐ సరవయ్య, టౌన్ సీఐ దేవేందర్ లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్మానించారు. ఊరీ వర్షాల్లో ఇబ్బందులు పడ్డ బాధితులను ఆదుకునేలా చర్యలు చేపట్టిన మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ ను, రాష్ట్ర ముఖ్యమంత్రి నుంచి సన్మానం అందుకున్న ఎస్ఐ నగేష్ సిఐలు సర్వయ్య, దేవేందర్ లను డిజిపి డాక్టర్ జితేందర్, శాంతి భద్రతల అడిషనల్ డిజిపి మహేష్ ఎం భగవత్ ప్రశంసించారు. విధి నిర్వహణలో పలువురికి ఆదర్శంగా నిలిచారని వారిని కొనియాడారు.

## ప్రభుత్వ వైఫల్యం వల్లే
# వరదల్లో భారీ నష్టం

మొదటి పేజీ తరువాయి...

కారణంగానే భారీ నష్టం వాటిల్లిందని విమర్శించారు. వరద బాధితులకు సహాయం చేసేందుకే తాము ఇక్కడికి వచ్చామన్నారు. తొమ్మిది మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు మంత్రులు ఉండి కూడా జిల్లా ప్రజలను కాపాడలేకపోయారని హరీష్ రావు విమర్శించారు. పాలనపై పట్టుకోల్పోయిన సీఎం.. ప్రతిపక్షాలపై విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే ఈ నష్టం జరిగిందన్నారు. కట్టు బట్టలు తప్ప తమవద్ద ఏమీ లేవని వరద బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని హరీష్ రావు తెలిపారు. వరదల కారణంగా మరణించిన వారి కుటుంబాలకు రూ. 25 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కోల్పోయిన వస్తువులకు రూ. 2 లక్షల ఆర్థిక పరిహారం ఇవ్వాలన్నారు. ఎంతో మంది విద్యార్థుల సర్టిఫికెట్లు వరదలో కొట్టుకుపోయాయని.. వారి సర్టిఫికెట్లను వారికి ఇప్పించాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. వరద బాధితులకు కనీసం మంచినీళ్లు, అన్నం కూడా అందించలేకపోయారని ప్రభుత్వం తీరుపై హరీష్ రావు ధ్వజమెత్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయ లోపం కారణంగా ఈ ఘోరం జరిగిందని హరీష్ రావు విమర్శించారు. వరదల కారణంగా 28 మంది చనిపోతే.. ప్రభుత్వం మాత్రం 16 మందిని మాత్రమే చూపిస్తోందని ఆరోపించారు. భక్త రామదాసు, పాలమూరు ప్రాజెక్టులు మునిగిపోయాయని.. దీనంతటికీ కారణంగా రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరే అని తూర్పారబట్టారు. ప్రభుత్వ నిర్లక్ష్యం ధోరణి కారణంగా వేల ఎకరాల్లో పంట నీట మునిగిందన్నారు. పొంగలేటి శ్రీనివాస్ రెడ్డి గతంలో పంట నష్టానికి రూ. 30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారని.. ఇప్పుడు పంట నష్టానికి ఎకరాకు రూ. 30 వేలు ఇవ్వాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. అలాగే పొలాలు బాగు చేసుకోవడానికి రూ. 50 వేలు ఇవ్వాలన్నారు. అధికారంలో ఉండి.. ప్రతిపక్షం సహాయం చేయాలని అడుగున్నారని ప్రభుత్వం పెద్దల తీరుపై హరీష్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి చేతకానితనాన్ని, వారికి అంటిన బురదను ప్రతిపక్షంపై చల్లే కుట్ర చేస్తోన్నారని ఆరోపించారు. వరదలపై రాజకీయం చేస్తు?న్న ముఖ్యమంత్రిని తొలిసారి చూస్తున్నామన్నారు. ప్రభుత్వం తరఫున ఖమ్మం వచ్చిన ఆరుగురు ప్రముఖులు ఉపన్యాసాలు చెప్పారు తప్ప.. ప్రణాళిక గురించి మాట్లాడారా? అని హరీష్ రావు ప్రశ్నించారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఫెయిల్ అయ్యారని.. అందుకే ముఖ్యమంత్రి వచ్చారని వ్యాఖ్యానించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఓ అమ్మాయ మీద దాడి చేసేందుకు కాంగ్రెస్ యత్నిస్తోందని విమర్శించారు. ఆ అమ్మాయిని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యేగా ప్రజల కష్టాల తెలుసుకోవడాని వస్తే తమపైనా దాడి చేశారని కాంగ్రెస్ శ్రేణులపై హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడులు చేయడమే కాంగ్రెస్ ప్రజా పాలనా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించడమే తమ బాధ్యత అని ఉద్ఘాటించారు. వరద బాధితులకు ఇంటికి రూ. 2 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని బీఆర్ఎస్ తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు. బీఆర్ఎస్ పాలన బాగుందని ప్రజలే అంటున్నారని పేర్కొన్నారు. మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. కాగా, ఖమ్మం వరదల్లో చిక్కుకున్న బాధితులను కాపాడిన వారిని అభినందిస్తున్నట్లు హరీష్ రావు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున రాష్ట్ర వ్యాప్తంగా వరద బాధితులకు సహాయం అందిస్తామన్నారు. బుధవారం నాడు సిద్దిపేట నుంచి 4 లారీలలో ఆహార పదార్థాలతో తమ నాయకులు బయలుదేరుతారని.. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల నుంచి బీఆర్ఎస్ నాయకులు సాయం అందించబోతున్నారని హరీష్ రావు తెలిపారు. కాంగ్రెస్ నేతల తాటాకు చప్పుళ్లకు భయపడే ప్రసక్తే లేదన్నారు. ఇప్పటికైనా తేరుకుని.. బాధితులను కాపాడాలని ప్రభుత్వానికి హరీష్ రావు సూచించారు.

# నిరంతరం నేర్చుకునే వారిగా ఉండాలి





ఉత్తమ రైతులకు ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులు అందచేస్తున్న హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బి. జగదీశ్వర్ రావు, వ్యవసాయ విశ్వవిద్యాలయం ఇంచార్జ్ వైస్ చాన్సలర్ ఎం. రఘునందన్ రావు, రిజిస్ట్రార్ డాక్టర్ పి రఘురామిరెడ్డి లు

విద్యార్థులు, అధ్యాపకులు, శాస్త్రవేత్తలనుద్దేశించి మాట్లాడుతున్న హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బి. జగదీశ్వర్ రావు

## వ్యవసాయ విశ్వవిద్యాలయం 10వ వ్యవస్థాపక దినోత్సవంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బి. జగదీశ్వర్ రావు

రాజేంద్రనగర్, సెప్టెంబర్3(ప్రభాత ఉదయం): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పదవ వ్యవస్థాపక దినోత్సవం వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. రాజేంద్రనగర్ లోని విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఈ వేడుకల్ని నిర్వహించారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ బి. జగదీశ్వర్ రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. " గుడ్ క్వాలిటీ ఎడ్యుకేషన్ ఈస్ ద సొల్యూషన్ " అన్న అంశంపై ప్రొఫెసర్ బి. జగదీశ్వర్ రావు ఉపన్యసించారు. రాష్ట్రానికి కీలకమైన వ్యవసాయ రంగానికి ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఒక ఆభరణం వంటిదన్నారు. విద్య, జ్ఞానం అనేవి చాలా పదునైన అస్త్రాలని వాటితోనే సర్వసవాళ్ళని పరిష్కరించుకోవచ్చని ఆయన స్పష్టం చేశారు. విద్య అంటే కేవలం తరగతి గదులు, డిగ్రీలు అన్న భావన నుంచి బయటకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. విద్య అంటే చాలా లోతైన అంశమని వర్ణించారు. భారతదేశంలో నూతనంగా ప్రవేశపెట్టిన విద్యా విధానం విద్యకి సరికొత్త నిర్వచనం ఇచ్చిందన్నారు. విద్యార్థులు ప్రయోగాత్మకంగా నేర్చుకునే అవకాశాన్ని ఈ విధానం అవకాశం కల్పిస్తుందన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు నిరంతరం నేర్చుకోవడం పైనే దృష్టి పెట్టాలని అప్పుడే వికసిత భారత్ సాధ్యమవుతుందన్నారు. త్వరలోనే భారతదేశం ప్రపంచంలోనే మూడవ ఆర్థిక వ్యవస్థగా పరిణమించనున్నదని వివరించారు. దేశంలో పెద్ద సంఖ్యలో ఉన్న మానవ వనరులను సద్వినియోగం చేసుకోవాలని, టెక్నాలజీలను ఉపయోగించుకొని, తయారీ రంగంలో ముందుకు సాగాలని ఆయన సూచించారు. అదేవిధంగా దేశంలో సగం ఉన్న మహిళా శక్తిని పూర్తిస్థాయిలో సద్వినియోగ పరుచుకుంటే దేశం కొన్నేళ్లలోనే ప్రపంచంలో ప్రథమ స్థానానికి వెళుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కుటుంబాలు సంస్కరణ కేంద్రాలుగా మారి పిల్లలకు విలువలు ఇళ్ళలోనే నేర్పితే సమాజంలో అపసవ్య ధోరణలు తలెత్తవని జగదీశ్వర్ రావు అభిప్రాయపడ్డారు. ఇంటర్నెట్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అధునాతన టెక్నాలజీలే రానున్న వందేళ్లలో సమాజాన్ని శాసించనున్నాయని ఆయన వివరించారు. ఇందిరా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి వంటి మహామహులు గతంలో ఉమ్మడి వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారని, ఆ వారసత్వం కొనసాగింపుగా పదేళ్ల క్రితం ఏర్పాటైన వ్యవసాయ విశ్వవిద్యాలయం మరింత పురోగతి సాధించాలని ప్రొఫెసర్ జగదీశ్వర్ రావు ఆశాభావం వ్యక్తం చేశారు. ఏర్పాటైన పదేళ్లలోనే వ్యవసాయ విశ్వవిద్యాలయం బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో అనేక మైలురాళ్లు సాధించిందని వ్యవసాయ శాఖ కార్యదర్శి, వ్యవసాయ విశ్వవిద్యాలయం ఇన్చార్జి ఉపకులపతి ఎం. రఘునందన్ రావు వివరించారు. తెలంగాణ సోనా సహా సుమారు 67 నూతన వంగడాలని విడుదల చేశామన్నారు అవసరాలకు అనుగుణంగా కొత్త కళాశాలల్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఏర్పాటైన కొత్త ప్రభుత్వం రుణమాఫీ సహా అనేక రైతు కేంద్రీకృత పథకాలను అమలు చేస్తుందన్నారు. అందుకు అనుగుణంగా మనమందరము రైతాంగ సేవలకి పునరంకితం కావాలని రఘునందన్ రావు పిలుపునిచ్చారు. అంతకుముందు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్, పరిశోధనా సంచాలకులు డాక్టర్ పి. రఘురామి రెడ్డి స్వాగతోపన్యాసం ఇచ్చారు. ఈ సందర్భంగా ఉత్తమ రైతులకి, బోధన, బోధనేతర సిబ్బందికి పురస్కారాలు అందజేశారు. వేడుకలు ప్రారంభానికి ముందు ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి కి పూలు అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో బోధన, బోధ నేతర సిబ్బంది, రైతులు, విద్యార్థులు, విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతులు, అధికారులు పాల్గొన్నారు.




ఉద్యోగులకు, శాస్త్రవేత్తలకు ప్రశంసా పత్రాలను అందచేస్తున్న ప్రొఫెసర్ బి జగదీశ్వర్ రావు



డాక్టర్ ఎన్ అశ్వినీ పేరిట గోల్డ్ మెడల్ ను ఏర్పాటు చేయాలని నినాదాలు చేస్తున్న విద్యార్థులు

## డాక్టర్ ఎన్ అశ్వినీ పేరున బంగారు పతకం ఏర్పాటు చేయాలి: కాటమ్ శ్రీధర్

బుద్వేల్, సెప్టెంబర్3(ప్రభాత ఉదయం): మహబూబాబాద్ జిల్లా పురుషోత్తమాయి గూడెం ఆకేరు వాగులో కొట్టుకుపోయిన వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్ అశ్వినీ పేరు మీద వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గోల్డ్ మెడల్ ఏర్పాటు చేయాలని వ్యవసాయ , ఉద్యాన, వెటర్నరీ విద్యార్థుల సంఘం నాయ కుడు డాక్టర్ కాటం శ్రీధర్ డిమాండ్ చేశారు. ఈ విషయమై మంగళవారం రాజేంద్రనగర్ లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటో రియం వద్ద నినాదాలు చేశారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం 10వ వ్యవస్థాపక దినోత్స వం సందర్భంగా విద్యార్థులతో కలిసి డాక్టర్ కాటం శ్రీధర్ మాట్లాడుతూ అశ్వరావుపేట వ్యవసాయ కళాశాలలో బీఎస్సీ అగ్రికల్చరల్ పూర్తి చేసి, రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశా లలో ఎంఎస్సీ, పీహెచ్ డీ చదివి యూని వర్సిటీ స్థాయిలో ఆరు గోల్డ్‌మెడల్‌లు సంపా దించిన డాక్టర్ అశ్విని పేరుతో గోల్డ్ మెడల్ ఏర్పాటు చేయాలని కోరారు. చదువు అనంతరం బెంగళూరులో ఐసీఎఆర్ సంస్థ లో వ్యవసాయ శాస్త్రవేత్తగా పనిచేస్తున్న డాక్టర్ అశ్వినీ స్వగ్రామానికి వచ్చి తిరిగి బెంగుళూరుకు వెళ్ళడానికి తండ్రి మోతిలాల్ నాయక్ తో కలసి కారులో హైదరాబాద్ వెళుతుండగా మహబూబాబాద్ జిల్లా పురుషోత్తమాయిగూడ వద్ద ఆకేరు వాగులో కొట్టుకుపోయిందన్నారు. తండాలో జన్మించి వ్యవసాయ విద్యలో ఉన్నత చదువులు చదివి ఒక శాస్త్రవేత్తగా స్థిరపడుతున్న సమయంలో అకాల వర్షం, వరద బీభత్సం కారణంగా ఎంతో భవిష్యత్తు ఉన్న డాక్టర్ అశ్వినీ మరణించిందని అన్నారు. ఆమె ఆమె జ్ఞాపకార్థం వ్యవసాయ విశ్వవిద్యాలయం గోల్డ్ మెడల్ ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.



అవార్డు అందుకుంటూ... అశ్వినీ

# ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం 10వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పలువురికి అవార్డులు



అవార్డు అందుకుంటున్న ప్రభాకర్ రెడ్డి



అవార్డు అందుకుంటున్న డాక్టర్ రాజశేఖర్



అవార్డు తో ఎస్. నర్సింగ్ రావు



బెస్ట్ రీసెర్చ్ స్టేషన్ అవార్డు పొందిన రాజేంద్రనగర్ వరి పరిశోధన సంస్థ



అగ్రి డిప్లొమా లో గోల్డ్ మెడల్ సాధించిన కె నిఖిత

బుద్వేల్, సెప్టెంబర్3(ప్రభాత ఉదయం): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాల యం 10వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మంగళ వారం సంస్థలో పనిచేస్తున్న అధ్యాపకులకు, శాస్త్రవేత్త లకు , ఉద్యోగులకు, విద్యార్థులకు, వర్సిటీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సంస్థలకు అవార్డులను అందజేశారు. ఉత్తమ రైతులను సన్మానించి నగదు పారితోషికం తో పాటు ప్రశంసా పత్రాలు, మెమోంటోలు బహూకరించా రు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివ ర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బి జే రావు, వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఎం. రఘునందన్ రావు, రిజిస్ట్రార్ డాక్టర్ పి. రఘురామిరెడ్డి లు పాల్గొన్నారు.

### అవార్డులు పొందిన వారు వీరే :

వ్యవసాయ విశ్వవిద్యాలయం, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బెస్ట్ టీచర్ అవార్డు ను డాక్టర్ ఎన్ బలరాం అందుకున్నారు. ఆయనకు రూ.10 వేల నగదు బహుమతితో పాటు సర్టిఫికెట్ ను అందజేశారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం బెస్ట్ ఫ్యాకల్టీ అవార్డును డాక్టర్ ఎం. వెంకటయ్య అందుకున్నారు. ఆయన కు రూ 10వేల నగదు పురస్కారాన్ని అందజేశారు. బెస్ట్ రీసెర్చ్ సైంటిస్ట్ అవార్డును డాక్టర్ టి ఎల్ నీలిమ, డాక్టర్ ఎస్ ఓం ప్రకాష్ (వరంగల్)లు అందుకున్నారు. బెస్ట్ ఎక్స్టెన్షన్ సైంటిస్ట్ అవార్డును డాక్టర్ కే రవికుమార్ వైద ఎం రాజశేఖర్ విత్ హైయెస్ట్ నాస్ అవార్డులు డాక్టర్ పి సుజాత అందుకున్నారు. బెస్ట్ టీచర్, రీసెర్చ్, ఎక్స్ టెన్షన్ సైంటిస్ట్ విత్ హ యెస్ట్ ఫండెడ్ ప్రాజెక్ట్ అవార్డును డీన్ పీజీ స్టడీస్ గా ఉన్న డాక్టర్ వి అనిత అందుకున్నారు. బెస్ట్ టీచర్ అవార్డును డాక్టర్ ఎ. మీనా, బెస్ట్ రీసెర్చ్ సైంటిస్ట్ అవార్డును డాక్టర్ సంధ్య కిషోర్, అవుట్ స్టాండింగ్ రీసెర్చ్ వర్క్ ఇన్ సాయిల్ సైన్స్ లో డాక్టర్ జి కిరణ్ రెడ్డి, డిప్లొమా అగ్రికల్చర్ లో గోల్డ్ మెడల్లో కె. నికిత తీసుకున్నారు. అవార్డులు పొందిన వారిలో డాక్టర్ పి జగన్మోహన్ రావు, డాక్టర్ ఎ. గీత, ఎం రాజశేఖర్ లు ఉన్నారు. నాన్ టీచింగ్ విభాగంలో ఎల్ బి మురళీమోహన్ , ఎం దశరథ , జి సుదర్శన్, జె ప్రభాకర్ రెడ్డి , ఎ. పద్మ , ఎస్ నర్సింగ్ రావు, రమేష్ భూక్య, మహమ్మద్ ఉమర్ అహ్మద్, ఎస్ రమణ , సీహెచ్ రమేష్, బి . శంకు స్వామి, ఎం మహేష్ , జె. రాజా రామ్, సిహెచ్ సురేష్ , ఎం నాగార్జున అవార్డులను అందుకున్నారు. రికార్డు అసిస్టెంట్ విభాగంలో కె పాండు, కె. కిషన్ , బి శారద, ఫాతిమా బీ, జే వెంకటమ్మ , టీ పోసు లు అవార్డులు అందుకున్నారు. బెస్ట్ ఇనిస్టిట్యూషన్ అవార్డుల విభాగంలో బెస్ట్ కాలేజీ గా వరంగల్ వ్యవసాయ కళాశాల, బెస్ట్ రీసెర్చ్ స్టేషన్ గా రాజేంద్రనగర్ వరి పరిశోధన సంస్థ , బెస్ట్ ఎక్స్ టెన్షన్ సెంటర్ గా మాల్యాల్ కే వీ కే, బెస్ట్ పాలిటెక్నిక్ కాలేజ్ గా జగిత్యాల్ పలాస అగ్రికల్చరల్ పాలిటెక్నిక్ కళాశాలలు అవార్డులందుకున్నాయి.



సమావేశానికి హాజరైన ఉద్యోగులు, ఇతర ప్రముఖులు

# కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి: ఎంపీ డీకే అరుణ



లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 3(ప్రభాత ఉదయం) కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మహబూబ్ నగర్ పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణ అన్నారు. మంగళవారం గద్వాల పట్టణంలోని ఎస్వీఎం డిగ్రీ కళాశాల సమీపంలో ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం కింద దరఖాస్తులు చేసుకున్న వారికి శిక్షణ కేంద్రాన్ని పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీకే అరుణ మాట్లాడుతూ...కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు ఈ సందర్భంగా మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యురాలు డికె. అరుణమ్మ మాట్లాడుతూ... ఈ పథకం కింద ప్రయోజనాలను పొందేందుకు రుణ గ్రహీతలకు డిజిటల్ ఐడి పీఎం విశ్వకర్మ డిజిటల్ సర్టిఫికెట్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణ కాలంలో రుణాగ్రహీతలకు టైలరింగ్ పథకంకు సంభవించిన రూ.15,000 వరకు టూల్ కిట్ ప్రోత్సహకం అందిస్తుందని అన్నారు.. వృత్తి శిక్షణ కేంద్రంలో 7రోజుల ప్రాథమిక శిక్షణ పూర్తి అయిన తర్వాత రోజుకు రూ.500 ఇవ్వడం జరుగుతుందని అన్నారు.18 రకాల చేతివృత్తులు కార్పెంటర్, కమ్మరి, గోల్డ్ స్మిత్, కుమ్మరి, మేస్త్రీలు, చాప ,చీపుర్లు, మొదలగు పనిచేసే వారికి ఈ పథకం వర్తింపచేస్తుందని మధ్య తరగతి కుటుంబాలకు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఈ పథకం ఎంతో ఉపయోగ పడుతుంద న్నారు. సాంప్రదాయ హస్తకళలను కాపాడటం : చేతివృత్తుల వారికి నైపుణ్యాలకు తోడ్పాటు అందించడం ద్వారా భారతదేశం యొక్క వైవిధ్యమైన సాంప్రదాయ హస్తకళల వారసత్వాన్ని కాపాడటం, ప్రోత్సహించడంలో ఈ పథకం కీలక పాత్ర పోషిస్తుందని ఈ నిబద్ధత భవిష్యత్ తరాలకు పాత- పద్ధతులను ప్రసారం చేయడానికి నిర్ధారిస్తుంది, ఈ సంప్రదాయాలు కొనసాగడానికి,అభివృద్ధి చెందడానికి అనుమతిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, అసెంబ్లీ కో కన్వీనర్ రామాంజనేయులు, పట్టణ అధ్యక్షుడు బండల వెంకటరాములు, అసెంబ్లీకి పోటీ చేసిన అభ్యర్థి బలిగేర శివారెడ్డి, ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షుడు దాసు, బిజెపి సీనియర్ నాయకులు రజక నరసింహ,కిష్టన్న, డబ్బిలేటి నరసింహ, చిత్తారి కిరణ్, తదితరులు హాజరయ్యారు..



మండపాల యువకులను ఉద్దేశించి మాట్లాడుతున్న సిఐ రవిబాబు

## గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

### అలంపూర్ సిఐ రవిబాబు

అలంపూర్ ,సెప్టెంబర్3(ప్రభాత ఉదయం) గణేష్ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో శాంతియుతంగా జరుపుకోవాలని అలంపూర్ సిఐ రవిబాబు ఉత్సవ కమిటీ ప్రతినిధులకు సూచించారు. మంగళవారం అలంపూర్ పోలీస్ స్టేషన్ లో పట్టణ , మండలం లోని గణేష్ కమిటీ నిర్వాహకులతో వివిధ మత పెద్దలతో శాంతి మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ రవి బాబు మాట్లాడుతూ... రాబోయే గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. గణేష్ మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు పోలీసుల దగ్గర అనుమతి తీసుకోవాలని కోరారు. ఎవరిని ఇబ్బందుల గురి చేయకుండా ఉత్సవాలు జరుపుకోవాలని సూచించారు. గణేష్ మండపాల దగ్గర జాగ్రత్తలు పాటించాలని కోరారు.

**గణేష్ ఉత్సవాల మండల కమిటీ ఎన్నిక**

గణేష్ ఉత్సవ కమిటీ అలంపూర్ మండల అధ్యక్ష కార్యదర్శులను ఏకగ్రీవంగాఎన్నుకున్నారు.అలంపూర్ గణేశ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అలంపూర్ మండల అధ్యక్ష కార్యదర్శుల ఎన్నికలలో గణేష్ మండపాలు నిర్వహించే సభ్యులందరూ కలిసి ఏకగ్రీవంగా అధ్యక్ష కార్యదర్శులను ఎన్నుకోవడం జరిగింది మండల అధ్యక్షుడు గా శేఖర్ రెడ్డి ఉపాధ్యక్షుడు గా నర్సన్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఎం.బి సంజీవ నాయుడును ఎన్నుకున్నారు.



## విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్ పంపిణి

గద్వాల(ధరూర్), సెప్టెంబర్ 3(ప్రభాత ఉదయం) ధరూర్ మండలం జాంపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఐకెపి సెర్ప్ మహిళా సంఘాల ఆధ్వర్యంలో రూపొందించిన రెండవ దఫా యూనిఫామ్స్‌ను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు రేవతి మాట్లాడుతూ... విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదివి జీవితంలో స్థిరపడి తల్లిదండ్రులకు చదువుకున్న పాఠశాలకు మంచి పేరు తేవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ మహిళా సంఘాల సభ్యులు, సిసి నవీన్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసులు దాడి

### 32 వేల రూపాయలు, ఒక స్కూటీ, ఒక మొబైల్ స్వాధీనం

### 11మంది పై కేసు నమోదు

గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 3(ప్రభాత ఉదయం)పేకాట స్థావరంపై పోలీసులు దాడిచేసి పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్టు చేశారు. ఈ ఘటన గద్వాల రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. గద్వాల రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం... గద్వాల మండలం పూడూరు శివారులో కొందరు వ్యక్తులు పేకాడుతున్నట్లు సమాచారం అందింది. ఈమేరకు రూరల్ పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేశారు. అక్కడ పేకాడుతున్న 11మంది వ్యక్తులను అరెస్టుచేసి వారి నుంచి రూ.32,000 నగదు, ఒక స్కూటి వాహనం, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. అరెస్టు అయిన వారిలో మేళ్లచెర్వు గ్రామానికి చెందిన వినోద్ చరణ్, జానీ (చంద్రన్న), ప్రభాకర్, కుర్వపల్లి గ్రామానికి తిమ్మప్ప, పరుష, ఆంజనేయులు, కొండపల్లి గోవర్ధన్, దౌదర్ పల్లి నరసింహ, గద్వాల తిమ్మన్న ,మార్ల బీడు సుధాకర్ ల పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## రూ.10 వేలు లంచం తీసుకుంటూ పట్టు బడిన డిఎస్టీఓ

### గద్వాలలోని ఆయన నివాసంలో ఏసిబి సోదాలు



ఏసీబీ దాడుల్లో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ మహబూబ్ నగర్ లో డిఎస్టీఓ

గద్వాల ప్రతినిధి,సెప్టెంబర్3 (ప్రభాత ఉదయం) జీఎస్టీ లైసెన్స్ కోసం ఓ వ్యాపారి నుంచి లంచం తీసుకున్న డిప్యూటి స్టేట్ టాక్స్ అధికారి దిన్నె వెంకటేశ్వర్ రెడ్డి ని మంగళవారం ఏసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మహబూబ్ నగర్ మర్లులోని ఓ వ్యాపారి సీడ్స్ అండ్ స్క్రాప్ బిజినెస్ కోసం విడిఎన్ ట్రేడర్స్ పేరిట జీఎస్టీ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోగ ఆ వ్యాపారి నుంచి మహబూబ్ నగర్ జిల్లా వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటి స్టేట్ టాక్స్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న దిన్నె వెంకటేశ్వర్ రెడ్డి రూ.50వేలు డిమాండ్ చేశారు. దీంతో ఆ వ్యాపారి ఏసిబి అధికారులను ఆశ్రయించారు. మహబూబ్ నగర్ ఏసిబి డిఎస్పీ కృష్ణయ్య గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం మహబూబ్ నగర్ లోని వాణిజ్య పన్నుల అధికారి కార్యాలయంలో వ్యాపారి నుంచి రూ.10వేలు లంచం తీసుకుంటున్న డిప్యూటి స్టేట్ టాక్స్ అధికారి దిన్నె వెంకటేశ్వర్ రెడ్డి ని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈ నేపథ్యంలో ఏసిబి బృందాలు పలు చోట్ల సోదాలు నిర్వహిస్తున్నారు.

**గద్వాలలో డిప్యూటి స్టేట్ టాక్స్ అధికారి దిన్నె వెంకటేశ్వర్ రెడ్డి ఇంట్లో ఏసిబి సోదాలు**

మహబూబ్ నగర్ జిల్లాలో ఏసిబి రైడింగ్ లో పట్టుబడిన డిప్యూటి స్టేట్ టాక్స్ అధికారి దిన్నె వెంకటేశ్వర్ రెడ్డి స్వస్థలమైన గద్వాల పట్టణంలోని వెంకటేశ్వర్ కాలనీలో ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. నల్గొండ ఏసిబి ఎస్ఐలు వెంకట్రావ్, రామారావు ఆధ్వర్యంలో మొత్తం 9 మంది గద్వాలలో సోదాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో డిప్యూటి స్టేట్ టాక్స్ అధికారి దిన్నె వెంకటేశ్వర్ రెడ్డి భార్య ప్రవీణను ఏసిబి అధికారులు విచారిస్తున్నారు. అదే విధంగా అతడి బంధువుల ఇండ్లలో సైతం అధికారులు సోదాలు నిర్వహించే అవకాశం ఉందని తెలుస్తోంది.



రేషన్ డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి


## అర్హులైన ప్రతి పేదవాడికి రేషన్ కార్డు అందేలా కృషి చేస్తా: ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, సెప్టెంబర్ 3(ప్రభాత ఉదయం) అర్హులైన ప్రతి పేదవాడికి తెల్ల రేషన్ కార్డు అందేలా కృషి చేస్తానని మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం కొత్త రేషన్ కార్డులు అర్హులకు పంపిణీ చేయాలని ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిన సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని రేషన్ డీలర్లతో రాష్ట్రంలోనే మొదటిసారి రేషన్ డీలర్లతో సమావేశం ఏర్పాటు చేశారు.నియోజకవర్గ పరిధిలోని రేషన్ డీలర్లతో సమావేశంలో ప్రజలకు రేషన్ డీలర్లకున్న సమస్యల పై చాలా అంశాలు చర్చకు వచ్చాయి. ఈ సందర్భంగాఎమ్మెల్యే మర్రి రాజ శేఖర్ రెడ్డి మాట్లాడుతూ... గతంలో మూడునెలలు రేషన్ తీసుకోకుంటే కార్డులను తీసేశారని, వాటిని పునరుద్ధరించాలని, తెల్ల రేషన్ కార్డు లేకపోవడంతో ప్రభుత్వం నుండి వస్తున్న పథకాలను పొందలేక నిజ మైన అర్హులు ఇబ్బంది పడుతున్నారని, అంత్యోదయ కార్డును దివ్యాంగులకు, విడోస్‌కు, HIV పేషెంట్లకు, డయాలిసిస్ పేషెంట్లకు , కుష్టు వ్యాధి గ్రస్తులకు వర్తింపజేయాలని ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి పౌరసరఫరాల శాఖల అధికారులకు సూచించారు. రేషన్ కార్డు జారీ తర్వాత పుట్టిన పిల్లల పేర్లు రేషన్ కార్డులో చేర్చడం, పెళ్లి చేసుకుని అత్త గారింటికి వెళ్ళిన ఆడ పిల్లల పేర్లను తొలగించి,అదే విధంగా కుటుంబంలో కి కొత్తగా వచ్చిన వారి పేర్లను చేర్చి, చనిపోయిన వారి పేర్లను తొలగించాలని .. ఇలా ఎప్పటికప్పుడు పేర్లను తొలగిస్తూ, అవసరమైన వారి పేర్లను చేర్చితే ప్రభుత్వ పథకాలకు అర్హులవుతారన్నారు.

## వర్షానికి దెబ్బతిన్న ఇల్లు, చెరువుల సర్వేలను చేపట్టాలి: జిల్లా కలెక్టర్ శశాంక్



రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 3(ప్రభాత ఉదయం) జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పాక్షికంగా దెబ్బతిన్న ఇండ్ల, పూర్తిగా నష్టం జరిగిన ఇండ్ల వివరాలు ,చెరువుల ఫైనల్ నోటిఫికేషన్ జారీ చేయుటపై మంగళవారం జిల్లా కలెక్టర్ శశాంక ఆర్డీఓలు, తహశీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శశాంక్ మాట్లాడుతూ... గత రెండు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జిల్లాలో దాదాపు 40 ఇండ్లు పాక్షికంగా, రెండు ఇండ్లు పూర్తిగా ధ్వంసమైనట్లు గుర్తించామని, వీటికి సంబంధించి ఏ మేరకు నష్టం వాటిల్లిన వివరాలను వెంటనే సమర్పించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పాక్షికంగా, పూర్తిగా ధ్వంసమైన ఇండ్ల నష్టపరిహారనికి సంబంధించిన నివేదికలు వెంటనే కలెక్టరేట్ కు సమర్పించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సమిష్టిగా నాలాల పరిసరాలను పరిశీలించి, తగు జాగ్రత్తలు తీసుకునే విధంగా అధికారులు చొరవ చూపాలని అన్నారు. ఆర్డీఓలు, తహశీల్దార్లు తమ పరిధిలోని ఏదైన విలువగల ప్రభుత్వ భూమి ఉన్నట్లయితే వెంటనే వాటికి కంచె వేయుటకు చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలోని 100 చెరువులకు ప్రిలిమినరీ నోటిఫికేషన్ పెండింగ్ లో ఉన్నాయని, ఇప్పటి వరకు 925 చెరువులలో 99 చెరువులకు మాత్రమే ఫైనల్ నోటిఫికేషన్ పూర్తి చేయడం జరిగిందని, ఇంకా 820 చెరువులకు ఫైనల్ నోటిఫికేషన్ పూర్తి చేయవలసి ఉన్నదని, వీటిని త్వరితగతిన పూర్తి చేయడానికి వారానికి 30 నుండి 40 చెరువులను సర్వే నిర్వహిస్తే సకాలంలో పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో కోర్టు కేసులకు సంబంధించి ఆయా కోర్టులలో అధికారులు వెంటనే తగిన సమాచారం అందించి స్పందించాలని, వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో లాండ్ ప్రొటెక్షన్ అధికారి కె.ఎస్.బి. కుమారి, మండలాల నుండి తహశీల్దార్లు, ఆర్డీఓలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

## అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు: ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

### షాదీముబారక్ చెక్కులు పంపిణి చేసిన ఎమ్మెల్యే

గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 3(ప్రభాత ఉదయం)గద్వాలలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పంపిణీ చేశారు. గద్వాల మండలం, మున్సిపాలిటీ పరిధిలోని షాదీ ముబారక్ పథకం కింద మంజూరయిన చెక్కులను 47మంది అర్హులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, గద్వాల మున్సిపల్ వైస్ చైర్మన్ బాబర్,కౌన్సిలర్లు మురళి, నాగిరెడ్డి, నరహరి శ్రీనివాసులు, దౌలు, పూడూరు కృష్ణ, రిజ్వాన్, ప్రియాంక, మాజీ గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రామన్ గౌడ, మాజీ ఎంపీపీ ప్రతాప్ గౌడ్, నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, రమేష్ నాయుడు, గోపీ రెడ్డి, మాజీద్, సతీష్, షకుర్, గోవిందు, ధర్మ నాయుడు, నరేందర్ రెడ్డి, రాముడు , కురుమన్న, వంట భాస్కర్, లక్ష్మీ కాంత్ రెడ్డి, కేశవరెడ్డి, పూడూరు శ్యామ్, పూడూరు రఘు, అన్వర్ , మోబిన్, పవన్ యాదవ్, ఫయాజ్, గంట రమేష్, అన్వర్, దౌలన్న,నపూడూరు చిన్నయ్య, గోపాల్, రంజాత్, వీరేష్, కొత్త గణేష్, శ్రీనివాస్ యాదవ్, రామచందర్, బాలాజీ, రఘు, ప్రవీణ్, ప్రీతం తదితరులు పాల్గొన్నారు.



## బాధితులకు న్యాయం చేస్తాం

### ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి

### బాధితులను పరామర్శించిన గద్వాల ఎమ్మెల్యే

గద్వాల జిల్లా ప్రతినిధి , సెప్టెంబర్ 3(ప్రభాత ఉదయం)ధరూర్ మండల పరిధిలోని మార్లబీడు గ్రామానికి చెందిన డబ్బా నర్సింహులు హనుమాన్ కిరణం జనరల్ స్టోర్ నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో దుకాణం దగ్ధం కావడంతో సుమారు రూ.3లక్షల అస్తినష్టం వాటిలింది. విషయం తెలుసుకున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మంగళవారం మార్లబీడు గ్రామంలో కిరణం జనరల్ స్టోర్ ను షాపును సందర్శించి షాప్ యజమాని డబ్బా నరసింహులను పరామర్శించారు. ఏ విధంగా షార్ట్ సర్క్యూట్ ఎలా జరిగినది విషయాన్ని తెలుసుకోవడం జరిగింది. ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అదే విధంగా తన వంతు ఆర్థిక సహాయాన్ని కూడా ఎమ్మెల్యే అందజేశారు. ఎమ్మెల్యే వెంట మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, డి.ఆర్ విజయ్, శ్రీరాములు, ఆనంద్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.